
- మార్కెట్‌లో మంచి డిమాండ్
- ఇతర రాష్ట్రాలకు తరలింపు
- ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా సన్న, చిన్నకారు రైతులకు రూ.2లక్షల వరకు సబ్సిడీ

# డ్రాగన్ ఫ్రూట్స్ సాగు.. లాభాలు బాగు



డ్రాగన్ ఫ్రూట్స్



డ్రాగన్ ఫ్రూట్స్ తోట

వికారాబాద్, అక్టోబర్ 8 : సంప్రదాయ పంటలతో పాటు ఆధునిక పంటల సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. రైతులకు లాభాలు, ప్రజలకు ఆరోగ్యాన్ని తెచ్చిపెట్టే డ్రాగన్ ఫ్రూట్ తదితర పంటల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. సరికొత్త ఆలోచనతో వినూత్న పద్ధతుల్లో పంటలను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వికారాబాద్ జిల్లాలో డ్రాగన్ ఫ్రూట్ సాగు వేగంగా విస్తరిస్తున్నది. కొత్త పంటలు సాగు చేయాలనే ఉత్సాహంతో రైతులు నూతన సాగు పద్ధతులను అవలంబిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో డ్రాగన్ ఫ్రూట్ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. డ్రాగన్ ఫ్రూట్ అనేక రకాల యాంటి ఆక్సిడెంట్లతో నిండి ఉంటుంది. డ్రాగన్ ఫ్రూట్స్ రెండు రకాలు. ఒకటి తెలుపు రంగులో ఉంటుంది. మరోటి గులాబీ రంగులో ఉంటుంది. తెలుపు రంగులో ఉన్నవి కాస్త పుల్లగా.. గులాబీ రంగులో ఉన్న పండు టేస్టీగా ఉంటుంది. ఇది క్యాన్సర్ తదితర ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షిస్తుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అనేక రకాల విటమిన్లు, కాల్షియం, ఐరన్, మెగ్నిషియం, ఫైబర్ తదితర మేలు చేసే గుణాలు ఉంటాయని చెబుతున్నారు. ఒక డ్రాగన్ ఫ్రూట్ దాదాపు 100 కేలరీల శక్తిని అందిస్తుందని, కొవ్వును కలిగి ఉండదని, గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని, ఇది రక్తంలో చక్కర స్థాయిని తగ్గిస్తుందని పేర్కొంటున్నారు. ఈ పంటను సాగు చేసేందుకు ఉద్యానవన శాఖ అధికారులు పూర్తిగా సహకరిస్తున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా సన్న, చిన్నకారు రైతులకు సబ్సిడీలు అందిస్తున్నారు. పంటలకు అవసరమైన సలహాలు, సూచనలు, సబ్సిడీలు అందించి రైతుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు.


## పంట వేసే విధానం

డ్రాగన్ ఫ్రూట్ మొక్క ధర రూ.50 నుంచి రూ.70ల వరకు ఉంటుంది. సిమెంట్ దిమ్మెలు, డ్రిప్ సాయంతో పంటను సాగు చేయవచ్చు. సేంద్రియ ఎరువులు వాడితే పంట దిగుబడి అధికంగా వస్తుంది. ఈ సాగు ఒక్క సారి నాటితే దాదాపు 25 నుంచి 30 ఏండ్ల వరకు పంట సాగు అవుతుంది. 7 ఫీట్ల సిమెంట్ దిమ్మె చుట్టూ నాలుగు మొక్కలను నాటవచ్చు. తీగ పద్ధతిలో ఈ పంటను సాగు చేయవచ్చు. మరో సిమెంట్ దిమ్మెకు మధ్యన 9 ఫీట్ల దూరం ఉండాలి. డ్రాగన్ ఫ్రూట్ చెట్టును దిమ్మె చుట్టూ అల్లి కిందకు జారకుండా దారంతో కట్టాలి. ఇది ఏడాదిలో మూడు సార్లు సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. తక్కువ నీటిని ఉపయోగించి పంటలు సాగు చేసుకోవచ్చు. ఇతర పంటల కంటే చీడ పీడలు తక్కువగా వ్యాపిస్తాయి. మొదటి ఏడాది మాత్రమే పెట్టుబడి పెట్టాలి. తర్వాత సంవత్సరం నుంచి పెట్టుబడి లేకుండా పంట సాగు చేయవచ్చు. 500 దిమ్మెలకు 2వేల మొక్కలు నాటే అవకాశం ఉంది. పంట పెంటుబడికి రూ.5లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఖర్చు అవుతుంది. మొక్కలకు నాలుగు రోజులకోసారి నీరు పట్టాలి. వర్షం పడితే వారం వరకు నీరు పోసే అవకాశం ఉండదు. నీరు ఎక్కువగా పడితే మొక్కులు త్వరగా పాడవుతాయి. డ్రాగన్ ఫ్రూట్ మొగ్గగా మారినప్పటి నుంచి పండుగా మారాలంటే 45 రోజుల సమయం పడుతుంది. 45 రోజుల తర్వాత పండును తినవచ్చు. డ్రాగన్ ఫ్రూట్ దాదాపు 2 నెలల వరకు పాడుకాకుండా భద్రపర్చుకోవచ్చు. దూర ప్రాంతాలకు సరఫరా చేసేందుకు బాక్సలలో వేసి భద్రపర్చాలి. ఉద్యానవన శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించి పంట దిగుబడి పెంచుకోవచ్చు.

## డ్రాగన్ ఫ్రూట్స్‌తో ఆదాయం

డ్రాగన్ ఫ్రూట్ ప్రస్తుతం కిలో ధర రూ.100 నుంచి రూ.140ల వరకు ఉంది. పంటను కోసిన తర్వాత 2 నెలల వరకు పండు పాడు కాకుండా నిల్వ చేసుకోవచ్చు. మార్కెట్‌లో అమ్ముకొనే అవకాశాలు ఉన్నాయి. డ్రాగన్ ఫ్రూట్ మొక్కను సైతం విత్తనంగా మార్చి మరో మొక్కను తయారు చేయవచ్చు. పొలంలో తక్కువ స్థలంలో నర్సరీగా మార్చి సీడ్స్ పెంచవచ్చు. దాంతో ఇతరులకు సీడ్స్ అమ్మి ఆదాయం పొందవచ్చు. లేదా మరో ఎకరా పొలంలో నాటి పంటను సైతం తక్కువ పెట్టుబడితో సాగు చేసే అవకాశం ఉంటుంది. ఉద్యానవన శాఖ అధికారులు సైతం పంట సాగుకు విడతల వారీగా డబ్బులు మంజూరు చేస్తారు. పంట వేసిన మూడేండ్ల వరకు పెట్టుబడులు పోను, తర్వాత లాభాలే మిగులుతాయి. చిన్న పాటి మెళకువలు పాటించి పంటలు దిగుబడి పెంచుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

### మూడేండ్ల నుంచి పంట సాగు



ఐదెకరాల పొలం ఉంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం వచ్చే పంటలు సాగు చేయాలనే ఆలోచనతో డ్రాగన్ ఫ్రూట్స్ గురించి తెలుసుకున్నాను. మూడు ఎకరాల్లో రెండు వేల మొక్కలు నాటాను. దాదాపు రూ.5లక్షల నుంచి రూ.6లక్షల వరకు ఖర్చు అయింది. వీటిలో గులాబీ రంగు డ్రాగన్ ఫ్రూట్‌ను కొనుగోలు చేసేందుకు చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. వికారాబాద్‌తో పాటు వరంగల్, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు ఈ పండ్లను ఆర్టీసీ కార్గో సేవల ద్వారా సరఫరా చేస్తున్నా. సేంద్రియ పద్ధతిలో సాగు చేసే దిగుబడి ఎక్కువగా వస్తుంది. సేంద్రియం ఎరువులను కొనుగోలు చేసి, తయారు చేస్తున్నా. ఈసారి డ్రాగన్ ఫ్రూట్స్ నర్సరీని సైతం ఏర్పాటు చేసుకున్నాను. ఎరువులు, మందులు పిచికారీ చేసేందుకు, పండ్లను కోసేందుకు అవసరమైన కూలీలను ఏర్పాటు చేసుకొని పండ్లను అమ్మకానికి పంపిస్తున్నా. డ్రాగన్ ఫ్రూట్‌తో పాటు మిగిలిన కొంత స్థలంలో జామ, మామిడి, అల్లనేరెడు, కొబ్బరి, అరటి తదితర మొక్కలు నాటి పండ్ల పెంపకం చేపట్టా. డ్రిప్ సాయంతో మొక్కలకు నీరు అందిస్తున్నా. 85 క్వింటాళ్ల వరకు దిగువడి రావడంతో రూ.6లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఆదాయం పొందుతున్నా.

**- టి. రాజారెడ్డి, రిటైర్డ్ పీడీ, వికారాబాద్**

### రైతులకు ఎంతో ఉపయోగం

సన్న, చిన్నకారు రైతులకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద రూ.2లక్షల వరకు సబ్సిడీ వస్తుంది. పంటకు పనికి రాని, బీడు భూమిలో సైతం డ్రాగన్ ఫ్రూట్స్ సాగు చేసుకోవచ్చు. ఎక్కువ నీరు అవసరం లేకుండా తక్కువ నీటితో సాగు చేయవచ్చు. సేంద్రియ ఎరువులు వాడితే పంట దిగుబడి అధికం అవుతుంది. జాబ్ కార్డులు కలిగిన రైతులకు అవకాశం ఉంది. సంవత్సరానికి మూడు పంటలు సాగు చేసుకోవచ్చు. లాభంతో పాటు ఆరోగ్యంగా ఉండొచ్చు. పంట పెట్టుబడికి పెట్టిన ఖర్చులు మూడేండ్లలో వస్తాయి. మరుసటి సంవత్సరం నుంచి 25 ఏండ్ల వరకు పెట్టుబడి అవసరం లేకుండా లాభాలు వస్తాయి. చిన్న పాటి మెళకువలతో పాటు యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి లాభాలు వస్తాయి. రైతులే ఆర్థికంగా ఎదిగేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఆసక్తి ఉన్న రైతులు 7997725221 నంబర్‌ను సంప్రదించాలి.

**- అర్చన, ఉద్యానవన శాఖ అధికారి, వికారాబాద్**

---

## పర్సాపూర్ వాసికి డాక్టరేట్



సత్యనారాయణ

కొడంగల్, అక్టోబర్ 8 : వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోకవర్గం పర్సాపూర్ గ్రామానికి చెందిన బానకారి సత్యనారాయణకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలుగు శాఖలో పీహెచ్‌డీ పూర్తి చేసినందుకు డాక్టరేట్ అవార్డును అందజేసినట్లు తెలిపారు. తెలుగు సాహిత్యంలో బహుజన సాహిత్య శిల్పిగా కాలువ మల్లయ్య అనే అంశంపై ప్రొఫెసర్ మసన చెన్నప్ప పర్యవేక్షణలో పరిశోధన చేసినట్లు తెలిపారు. ఈ పరిశోధన విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్‌ను అందుకున్నట్లు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ ద్వారా డాక్టరేట్ పట్టా అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. పాఠశాల నుంచి పీహెచ్‌డీ వరకు బోధించిన గురువులకు ప్రత్యేకంగా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గ్రామానికి చెందిన పలువురు విద్యావేత్తలు, స్థానికులు, కుటుంబ సభ్యులు సత్యనారాయణను ప్రత్యేకంగా అభినంధించారు.

## బుద్దారంలో హోటల్ ధ్వంసం

పెద్దేముల్, అక్టోబర్ 8 : గుర్తుతెలియని వ్యక్తులు ఓ హోటల్‌ను పూర్తిగా ధ్వంసం చేసిన ఘటన పెద్దేముల్ పోలీసు స్టేషన్ పరిధిలోని బుద్దారంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తలారి శ్రీనివాస్ తెలిపిన వివరాలు... మండల పరిధిలోని బుద్దారం గ్రామానికి చెందిన తలారి శ్రీనివాస్ అదే గ్రామంలో సుమారు రూ.70 వేల రూపాయల నుంచి రూ.80 వేల రూపాయల వరకు ఖర్చు చేసి బతుకు దెరువు కోసం టీ, టిఫిన్ సెంటర్ హోటల్‌ను 6 నెలల క్రితం ఏర్పాటు చేసుకొన్నాడు. ఆదివారం గుర్తు తెలియని దుండగులు శ్రీనివాస్‌కు చెందిన హోటల్‌లో ఉన్న కుర్చీలు, టేబుళ్లు, పైకప్పు రేకులను పూర్తిగా ధ్వంసం చేశారు. ఆదివారం ఉదయం శ్రీనివాస్ చూసే సరికి హోటల్ మొత్తం పూర్తిగా ధ్వంసం కావడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దుండగులను గుర్తించి, నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## బాపల్లితండా విద్యార్థికి సన్మానం



మంజునాథ్‌తో పాటు తల్లిదండ్రులను సన్మానిస్తున్న నాయకులు

బొంరాస్‌పేట, అక్టోబర్ 8 : నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ సీటు సంపాధించిన బాపల్లితండాకు చెందిన విద్యార్థి మంజునాథ్‌ను ఆదివారం ఎల్‌హెచ్‌పీఎస్, బీవీఎం ఆధ్వర్యంలో సన్మానించారు. చెట్టుపల్లితండాలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థితో పాటు తల్లిదండ్రులను శాలువాలతో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్ రూప్లానాయక్, సర్పంచ్ జ్యోతి తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంజునాథ్‌కు ఎయిమ్స్‌లో సీటు రావడం, రేగడిమైలారం బీక్యానాయక్ తండాకు చెందిన శివనాయక్‌కు ఫైర్ డిపార్ట్‌మెంట్‌లో ఫైర్‌మ్యాన్ ఉద్యోగం, విజయ్ గణేశ్‌కు ఆర్మీలో ఉద్యోగాలు రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తండా ప్రజలు పాల్గొన్నారు.

## ఏడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెద్దేముల్, అక్టోబర్ 8 : అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను పట్టుకొన్నామని ఆదివారం తాండూరు సీఐ రాంబాబు తెలిపారు. మండల పరిధిలోని రుక్మాపూర్ శివారులోని వాగు నుంచి కొందరు అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. శనివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో దాడులు నిర్వహించగా రుక్మాపూర్, మంబాపూర్, జనగాం గ్రామాలకు చెందిన సుమారు 7 ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## 20 కిలోల గంజాయి స్వాధీనం



ఎస్‌వోటీ, మంచాల పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

మంచాల, అక్టోబర్ 8 : ఎస్‌వోటీ, మంచాల పోలీసులు కలిసి ఆదివారం చేసిన దాడిలో 20కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. మంచాల సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాలు.. మంచాల మండలం ఆగపల్లి సాగర్ రహదారిపై ఒక వాహనంలో గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందింది. వెంటనే ఎస్‌వోటీ, మంచాల పోలీసులు వాహనాలను తనిఖీ చేసి గంజాయి తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్ర రాష్ట్రం జల్నా జిల్లా బుల్దానా తానా, ఖాదీం థానా గ్రామానికి చెందిన సచిన్ సంతోశ్ జాదవ్, శరథ్ భరత్ పవర్, రాహుల్‌ఖరత్, ఒడిస్సా రాష్ట్రానికి చెందిన ఉమేశ్ సునా మల్కాజిగిరి జిల్లా కర్మన్‌ఘట్ గ్రామంలో నివాసం ఉంటున్నట్లు చెప్పారు. వీరు ఒడిస్సాలో గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్రలో విక్రయించేందుకు రోడ్డు మార్గాన వెళ్తున్నారు. సమాచారం తెలుసుకున్న మహేశ్వరం జోన్ ఎస్‌వోటీ పోలీసులు, మంచాల పోలీసుల సహకారంతో సచిన్ సంతోశ్ జాదవ్, శరత్‌భరత్ పవర్‌ను పట్టుకున్నారు. వీరి వద్ద 20కేజీల గంజాయితో పాటు వెయ్యి రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. అయితే ఒడిస్సాలో గంజాయిని అమ్మిన రాహుల్ ఖరత్ మహారాష్ట్రలో గంజాయిని కొనుగోలు చేసి ఉమేశ్ సునా పరారీలో ఉన్నట్లు చెప్పారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆదిబట్ల, అక్టోబర్ 8 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాలు.. నేపాల్‌దేశం బచ్‌కోట్ అచ్చం జిలాటే, సుదూర్‌పుచికమ్ గ్రామానికి చెందిన కపిల్‌సౌద్ (26) తన భార్య పూజాసౌద్‌తో కుటుంబ సభ్యులతో కలిసి కమ్మగూడలో గత ఐదేండ్లుగా నివాసం ఉంటున్నారు. వీరు ఆదిబట్ల టీసీఎస్ సమీపంలో ఫాస్ట్ పుడ్ సెంటర్‌ను నడుపుతున్నారు. వారికి తెలిసిన వ్యక్తి బడంగపేటకు చెందిన వెర్ల సంజీవరావు.. కపిల్‌సౌద్‌ను తన బైక్‌పై ఎక్కించుకుని తుర్కయాంజాల్‌కు వెళ్లారు. తిరిగి కమ్మగూడకు వస్తుండగా వెనుక వైపు నుంచి వస్తు కారు ఢీకొట్టింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న క్రేన్ టైర్ కింద పడ్డారు. కపిల్‌సౌద్ అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.